సాక్షి పల్నాడు

సోమవారం । 27 । ఫిబ్రవరి । 2023



మోపిదేవి ఆలయానికి పోటెత్తిన భక్తులు

మోపిదేవి:వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే వేలాది మంది భక్తులు స్వామి దర్శనానికి తరలివచ్చారు.



నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):విజయవాడకు చెందిన పట్నాల నాగేశ్వరరావు కుటుంబం అమ్మవారి నిత్యాన్నదానానికి రూ.1,01,116 విరాళాన్ని ఆదివారం అందజేసింది.



ఉల్లాసంగా స్విమ్మింగ్ పోటీలు

తాడేపల్లిరూరల్: కృష్ణానది ఎగువ ప్రాంతంలో ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలు నిర్వహించారు. 400 మంది పోటీల్లో పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు జిల్లా విద్యార్థులు

– డీఈఓ వెంకటప్పయ్య

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో పల్నాడు జిల్లా నుంచి పది మంది విద్యార్థులు తమ నమూనాలను ప్రదర్శించేందుకు ఎంపికై నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటప్పయ్య, సైన్స్ ఆఫీసర్ ఏఏ మధుకుమార్ ఆదివారం తెలిపారు. ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలోని ఆంధ్ర లయోలా కళాశాలలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ప్రదర్శనలో ఐదు విభాగాల్లో తమ విద్యార్థులు నమూనాలను ప్రదర్శిస్తారని వివరించారు. పర్యావరణ హితకారకాల విభాగంలో షేక్ సాధిక్(క్రోసూరు), ఎం.చరణ్ (మాచవరం), ఆరోగ్యం–పరిశుభ్రతలో డి.వర్షిత (దుర్గి), సీహెచ్ కోమలి(సత్తెనపల్లి), సాఫ్ట్‌వేర్ అండ్ యాప్‌లో ఎం.లక్ష్మీశివపావని (శిరిగిరిపాడు), మహేష్‌కుమార్(జెట్టిపాలెం), పర్యావరణం–వాతావరణంలో మార్పులులో పి.గోపికృష్ణనాయక్ (నెమలిపురి), ఎస్.హరిబాబు (గోగులపాడు), గణిత నమూనాలు విభాగంలో కుర్రి రేణుక (శిరిగిరిపాడు), డి.పవన్‌కళ్యాణ్‌రాజు (మాచర్ల) తమ ప్రాజెక్టులను ప్రదర్శిస్తారని తెలిపారు. రాష్ట్ర స్థాయి ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరిచి పల్నాడు జిల్లాకు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు.

దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సర్వ మానవాళి సంపూర్ణ ఆరోగ్యాన్ని ఆకాంక్షిస్తూ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సూర్యోపాసన సేవ జరిగింది. రాజగోపురం ఎదుట కళావేదికపై సూర్యభగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజలు చేశారు. అనంతరం సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ నిర్వహించారు. సేవలో పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. ధర్మపథం కార్యక్రమంలో భాగంగా కళావేదికపై ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలో భక్తులతో పాటు ఆలయ సిబ్బంది, అర్చకులు కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

దుర్గమ్మకు కానుకగా బంగారు నత్తు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మంకు చెందిన శ్రీకృష్ణ కుటుంబం దుర్గమ్మకు ఆదివారం బంగారపు నత్తు కానుకగా సమర్పించారు. ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబను కలిసి 12.5 గ్రాముల బంగారంతో సుమారు రూ.75 వేల వ్యయంతో తయారు చేయించిన నత్తును అమ్మవారికి అలంకరించేందుకు అందించారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం తర్వాత అమ్మవారి ప్రసాదాలు పంపిణీ చేశారు. పాలక మండలి సభ్యులు బుద్దా రాంబాబు, బచ్చు మాధవీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గాంధీనగర్‌లోని ఎస్ఆర్ గ్రాండ్ హోటల్లో ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం అధ్యక్షుడు చేవూరి రామస్వామి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన తోలేటి శ్రీకాంత్ తొలుత విశ్వకర్మ భగవాన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ద్వారా రాష్ట్రంలోని విశ్వబ్రాహ్మణులు లబ్ధిపొందుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు చేవూరి రామస్వామి మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా సబ్సిడీపై రుణాలు అందించాలని కోరారు. ప్రతి జిల్లాలో కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోకవరపు శ్రీనివాస్, కోశాధికారి పిరంగి చంద్రశేఖర్, ప్రకాశం జిల్లా డైరెక్టర్ గొనుగుంట రజనీ, యువజన అధ్యక్షుడు పొడుగు శ్రీనివాస్, మహిళ అధ్యక్షురాలు కల్లూరి శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

వట్టివేరు.. లాభాల జోరు!

- భూమికి బదులుగా టవర్లలో వట్టివేరు పంట సాగు
- తక్కువ స్థలం, ఖర్చుతో అధిక లాభాలు
- నరసరావుపేట సమీపంలో సాగు చేస్తున్న అన్నా ప్రగడ సాయిప్రసాద్
- ఆరు పదుల వయసులో కొత్త రకం పంటల సాగు
- మార్కెట్‌లో వట్టివేరు నూనె లీటర్ రూ.15–18 వేలు
- ఔషధ, సుగంధద్రవ్యాల తయారీలో వట్టి వేరు నూనె వినియోగం
- వట్టివేరు వ్యర్థాలతో కూలర్ల ఫోమ్ తయారీ



టవర్ సాంకేతికతో సాగు చేస్తున్న వట్టి వేరు పంట

నేలపై వట్టివేరు సాగు

వట్టివేరు

సాక్షి, నరసరావుపేట: ఆరు పదుల వయసులోనూ వినూత్న వ్యవసాయానికి నాంది పలికాడు అన్నాప్రగడ సాయిప్రసాద్. ప్రైవేట్ కొలువులు చేసి ప్రస్తుతం పూర్తి స్థాయిలో వ్యవసాయంపై దృష్టి పెట్టి నరసరావుపేట సమీపంలోని కేసానుపల్లి గ్రామంలో వ్యవసాయం చేస్తున్నారు. సంప్రదాయ పద్ధతులు, పంటలు కాకుండా కొత్తగా ఆలోచించి లాభాల పంట పండిస్తున్నారు. ఆదర్శంగా నిలుస్తున్నారు.

భూమికి బదులు టవర్లలో వట్టివేరు సాగు..

పెరుగుతున్న జనాభా అవసరాలతో వ్యవసాయ భూమి క్రమంగా తగ్గిపోతోంది. ఇటువంటి నేపథ్యంలో కొత్త తరహా సాంకేతికతో వ్యవసాయం ప్రాముఖ్యతను గుర్తించారు సాయిప్రసాద్. భూమితో పనిలేకుండా టవర్ సాంకేతికతో లాభదాయక వ్యవసాయం చేస్తున్నాడు. ఇనుప జాలరీతో నాలుగు అడుగుల టవర్ ఏర్పాటు చేసి అందులో కవర్ ఉంచి సారవంతమైన మట్టి, ఎరువు నింపుతారు. టవర్ చుట్టూ 32 రంధ్రాలు వేసి అందులో వట్టి వేరు విత్తనాలు జల్లుతారు. నేలపై నాలుగు నెలల్లో పెరిగే మొక్క టవర్‌పై కేవలం రెండు నెలల్లోనే పెరుగుతోంది. మరోవైపు టవర్ సాంకేతిక సాగు వల్ల రైతుకు ఖర్చు సైతం తగ్గుతోంది.దుక్కి దున్నిల్సిన పనిలేదు. కలుపు తీయడం దాదాపుగా ఉండదు. తక్కువ నీటి అవసరాలతో పంటను పండించవచ్చు. కొద్దిపాటి నేలలోనే ఎక్కువ మొక్కలు సాగు చేసే వీలు ఉంటుంది. ఎకరానికి దాదాపు 400 టవర్లు ఏర్పాటు చేయవచ్చు. వేరు బాగా పెరిగిన తర్వాత మొక్కలు పెకిలించి వేర్లను వేరుచేస్తారు. ఇది కూడా నేలపై పోల్చితే సులభంగా ఉంటుంది.

వట్టివేరుతో ఉపయోగాలెన్నో..

వట్టివేరు నుంచి తీసిన నూనెతో శరీరంపై మర్దన చేస్తే ఒంటినొప్పులు దూరం అవుతాయి. ఈ నూనె సంతాన సాఫల్యత, చర్మవ్యాధులు, కీళ్ల నొప్పుల నివారణ, పుండ్ల నివారణ, మొటిమలను తగ్గించడానికి ఉపయోగిస్తారు. వైద్య వృత్తిలో అరోమాథెరపీ చేయడానికి వట్టివేరును ఉపయోగిస్తారు. సబ్బులు, లోషన్స్ వంటి సౌందర్య సాధనాల్లో కూడా ఎక్కువగా ఉపయోగిస్తారు. వట్టివేరు మొక్క ఆకులు, వేర్లు, పుష్పాలు, బెరడు అన్నీ కూడా మనకు మంచి ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాయి. పానీయాల తయారీలో వట్టివేరును వినియోగిస్తారు.

వట్టివేరు.. గట్టి లాభాలు

వట్టి వేరు లక్నో మార్కెట్‌లో కిలో రూ.110 దాకా అమ్ముడుపోతుంది. రైతులు వేర్ల నుంచి నూనెను సేకరిస్తే మరింత అధిక లాభాలు వస్తాయి. ఇలా సేకరించిన నూనె లీటర్ మార్కెట్‌లో రూ.15–18 వేల వరకు పలుకుతోంది. ఈ నూనెను ఔషధ, సుగంధ ద్రవ్యాలలో వాడుతారు. అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉంది. ఎకరానికి 25–30 లీటర్ల నూనెను ఉత్పత్తి చేయవచ్చు. వేర్ల వ్యర్థాలను కూలర్ల ఫోమ్, చాపలు, కూలింగ్ పరికరాల్లో వాడతారు. ఏడాది కాలంలో పూర్తయ్యే వట్టివేరు పంట ఎకరం సాగుకు రూ.లక్ష ఖర్చు అవ్వగా, ఖర్చులు పోనూ రూ.2 లక్షల వరకు ఆదాయం వస్తోంది. సాయి ప్రసాద్ గత ఏడాది 15 ఎకరాలు కౌలు తీసుకొని సాగు చేయగా, ఈ ఏడాది దాన్ని 60 ఎకరాలకు పెంచుతున్నారు.

వినూత్న పద్ధతిలో సాగుతోనే లాభాలు



రైతులు పంటలకు గిట్టుబాటు ధర లభించాలన్నా, సాగు లాభాల బాట పట్టాలన్నా వినూత్న పద్ధతిలో సాగుతోనే సాధ్యం. ఈ ఉద్దేశంతోనే టవర్ టెక్నాలజీతో వట్టివేరు సాగు చేస్తున్నాను. గతంలో భూమిలో సాగు చేసేటప్పుడు ఎక్కువ స్థలం, డబ్బులు అవసరమయ్యేది. టవర్ పద్ధతిలో తక్కువ భూమి, పెట్టుబడితో అధిక లాభాలు వస్తున్నాయి. రైతులు సంప్రదాయ పంటలతో పాటు వట్టివేరు వంటి పంటలను సైతం సాగు చేయాలి. అప్పుడే వ్యవసాయం గిట్టుబాటు అవుతుంది.

– అన్నాప్రగడ సాయిప్రసాద్, రైతు, కేసానుపల్లి, నరసరావుపేట మండలం

చకచకా ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు



హెలిప్యాడ్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటన కోసం ఏర్పాట్లు చకచకా పూర్తిచేస్తున్నారు. రాష్ట్రంలో నాలుగో సంవత్సరం మూడో విడత వైఎస్సార్ రైతు భరోసా, ఇటీవల పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ పంపిణీ కోసం ముఖ్యమంత్రి ఈ నెల 28వ తేదీ తెనాలి రానున్న విషయం తెలిసిందే. ఇందుకోసం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో బహిరంగ సభా వేదికను నిర్మించారు. భారీ టెంట్లను ఏర్పాటు చేశారు. అక్కడకు కిలోమీటరు దూరంలోని కవిరాజ నగర్‌లో హెలిప్యాడ్‌ను రూపొందిస్తున్నారు. వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ సహా పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌తో కలిసి ఈ ఏర్పాట్లను పరిశీలించిన విషయం తెలిసిందే. ఆదివారం కూడా ఎమ్మెల్యే శివకుమార్ దగ్గరుండి పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి బహిరంగ సభను జయప్రదం చేసేందుకు అన్ని విభాగాల అధికారులతో ఇప్పటికే జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు సమీక్షించినట్టు ఎమ్మెల్యే గుర్తుచేశారు. నియోజకవర్గం నుంచి రైతాంగం హాజరయ్యేలా చూస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా తెనాలి వస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి అపురూప స్వాగతం పలికేందుకు రైతులు, నియోజకవర్గ ప్రజలు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారని వివరించారు.

28న ట్రాఫిక్ మళ్లింపు

తెనాలి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం తెనాలి పర్యటన నేపథ్యంలో ఆ రోజు పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించనున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ జె.శ్రీనివాస్ ఆదివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి నారాకోడూరు మీదుగా వెళ్లే వాహనాలను చెంచుపేట మీదుగా వెళ్లేందుకు అనుమతించబోమన్నారు. గుంటూరు వెళ్లాల్సినవారు నందివెలుగు–గుంటూరు రహదారిని ఆశ్రయించాలని పేర్కొన్నారు. బాపట్ల నుంచి నారాకోడూరు మీదుగా తెనాలి వచ్చే అన్ని వాహనాలు పొన్నూరు, ఇంటూరు, తురిమెళ్ల, కూచిపూడి మీదుగా తెనాలి రావాల్సిఉంటుందన్నారు. అంగలకుదురు మీదుగా తెనాలి వచ్చే వాహనాలు దుండిపాలెం డొంక మీదుగా పట్టణంలోకి రావచ్చని తెలిపారు. 108 అంబులెన్స్‌లు, ఇతర ఎమర్జెన్సీ సర్వీసుల వాహనాలకు ఎటువంటి ఆంక్షలు ఉండవని స్పష్టం చేశారు. చెంచుపేట నుంచి అంగలకుదురు వరకు వాహనాల రాకపోకలపై నిషేధం ఉంటుందని, ప్రజలు గమనించాలని కోరారు.

సీఎం జగన్ తెనాలి పర్యటన షెడ్యూల్ ఇదే

తెనాలి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తెనాలి పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి సంబంధిత అధికారులకు సమాచారం అందింది. నాలుగో సంవత్సరం మూడో విడత వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్, పంటలు దెబ్బతిన్న రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 28వ తేదీ తెనాలి నుంచి బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో జమ చేయనున్న విషయం తెలిసిందే. ఆ రోజు ఉదయం 9:50 గంటలకు తాడేపల్లిలోని నివాసం నుంచి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. తాడేపల్లిలోని హెలిప్యాడ్ నుంచి హెలికాప్టర్‌లో 10 గంటలకు బయలుదేరి 10:15 గంటలకు తెనాలి కవిరాజనగర్‌లోని హెలిప్యాడ్‌లో దిగుతారు. ప్రజాప్రతినిధులతో పది నిమిషాలు మాట్లాడి, అక్కడ్నుంచి స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలోని బహిరంగ సభావేదికకు 10:35 గంటలకు చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను సందర్శించి, లబ్ధిదారులతో ఫొటోలు దిగుతారు. 10:45 గంటల్నుంచి 12:15 గంటల మధ్య రైతులకు నాలుగో సంవత్సరం మూడో విడత వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్, ఇన్‌పుట్ సబ్సిడీని పంపిణీ చేస్తారు. 12.20 గంటలకు సభావేదిక నుంచి హెలిప్యాడ్‌కు బయలుదేరి వెళతారు. అక్కడ 15 నిమిషాల పాటు స్థానిక నేతలతో ముచ్చటించి 12:45 గంటలకు హెలికాప్టర్‌లో తాడేపల్లికి బయలుదేరి వెళతారు.

పెండ్లి కుమారుడిగా శ్రీవారు

- వైభవంగా ప్రారంభమైన నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు
- ఉదయం తిరుమంజనోత్సవంతో పెండ్లికుమారుడి ఉత్సవం
- రాత్రి గ్రామోత్సవంలో పెండ్లికుమారుడిగా శ్రీవారు దర్శనం



పెండ్లికుమారుడి అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు

మంగళగిరి: ప్రసిద్ధ వైష్ణవ క్షేత్రాల్లో ఒకటిగా వెలుగొందుతున్న మంగళాద్రి లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మంగళాద్రి తిరునాళ్లగా పిలవబడే ఈ ఉత్సవాల్లో తొలిరోజు ఉదయం స్వామి పెండ్లికుమారుడి అలంకరణలో భక్తులకు దర్శనమించ్చారు. ఈ బ్రహ్మోత్సవాలు పెండ్లికుమారుడి ఉత్సవంతో ప్రారంభమయ్యాయి. ఉదయం శ్రీవారిని అమ్మవార్లను పంచామృత స్నపనతో మంగళస్నానాలు చేయించి అలంకరించారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులు పరమానందభరితులయ్యారు. రాత్రి 7 గంటలకు పెండ్లికుమారుడి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల సందర్భంగా సాయంత్రం ఐదు గంటల నుంచి రాజా వాసిరెడ్డి వేంకటాద్రినాయుడు కళావేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ ఈవో ఎ.రామకోటిరెడ్డి పర్యవేక్షణలో మంగళగిరి పట్టణ పద్మశాలీయ బహుత్తమ సంఘం వారు పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు.

నేడు ధ్వజారోహణం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి 8 గంటలకు ధ్వజారోహణం నిర్వహిస్తారు. దేవతలను ఆహ్వానించేందుకు భక్తాగ్రేసరుడైన గరుత్మంతుని ధ్వజంపై ప్రతిష్టించే ఉత్సవంలో అతిప్రధానమైనది. భక్తులు ఈ వేడుకకు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకుని గరుడుముద్దలు ప్రసాదంగా స్వీకరించాలని ఆలయ ఈవో ఎ.రామకోటిరెడ్డి తెలిపారు.

అసత్య కథనాలపై ఆగని నిరసన జ్వాల

- రాజ్యాంగానికి తూట్లు
- వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య
- అంబేడ్కర్ విగ్రహానికి విద్యార్థులు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చైతన్య, జిల్లా అధ్యక్షుడు వినోద్ కుమార్

నెహ్రూనగర్(గుంటూరు): ఈనాడు అసత్య కథనాలపై నిరసన జ్వాల కొనసాగుతోంది. విప్లవాత్మక సంస్కరణలతో సుపరిపాలన అందిస్తున్న జగన్ సర్కార్‌పై కుట్రపూరితంగా విషం చిమ్ముతున్న వైనంపై ఉవ్వెత్తున ఆగ్రహం ఎగిసిపడుతోంది. ఈనాడు పుట్టిందే అసత్య వార్తలు రాయడానికి, వ్యవస్థలను మేనేజ్ చేయడానికి అంటూ విద్యార్థి లోకం పేర్కొంటోంది. దిగజారిన పాత్రికేయ విలువలు తప్ప ప్రజాస్వామ్య విలువలు మచ్చుకైనా కానరాని ఈనాడును స్వచ్ఛందంగా బహిష్కరించాలని, రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చిన్నాబత్తిని వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. పెద్ద సంఖ్యలో హాజరైన విద్యార్థులు లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. రాజ్యాంగ పరిరక్షణకు పూనుకుంటామని ప్రతినబూనారు. అనంతరం బాయ్‌కాట్ ఈనాడు అన్న నినాదాలతో గుంటూరు నగరాన్ని హోరెత్తించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య మాట్లాడుతూ, అబద్ధపు రాతలతో ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తున్న ఈనాడు దినపత్రిక వైఖరిని ప్రజలంతా ఏవగించుకుంటున్నారని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదిరాళ్ల వంటి నాలుగు మూల స్తంభాల్లో ప్రధానమైన పత్రికా రంగాన్ని అడ్డం పెట్టుకుని ఆంధ్రప్రదేశ్‌లో అరాచకాలకు పాల్పడటం ద్వారా ఈనాడు దినపత్రిక, దాని యజమాని రామోజీరావు అంబేడ్కర్‌ను, ఆయన ఆలోచన విధానాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిజం ముసుగులో రామోజీ రాజ్యాంగాన్ని అమలు చేయాలని కలలుకంటున్న ఈనాడు, దాన్ని పెంచి పోషిస్తున్న చంద్రబాబు కుట్రలను తిప్పికొడతామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఇటు చంద్రబాబు, అటు ఈనాడు యజమాని రామోజీరావు ఎప్పటికప్పుడు కుట్రలు చేస్తూనే ఉన్నారని ఆరోపించారు. వైఎస్ జగన్‌పై పన్నే కుతంత్రాలను సహించేందుకు విద్యార్థులు సిద్ధంగా లేరని స్పష్టం చేశారు. కార్యక్రమంలో విద్యార్థి నేతలు విఠల్, రవి, గంటి, బాజి, జగదీష్, భాస్కర్, ప్రభు, కోటి, చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఘనం.. క్రమశిక్షణకు పట్టం

- ఇది పిడుగురాళ్లలోని మన్నెం పుల్లారెడ్డి జెడ్పీ హైస్కూల్ ప్రత్యేకత
- 2,170 మంది విద్యార్థులతో అలరారుతున్న వైనం
- ఉపాధ్యాయుల సంఖ్య 59 మంది
- మొత్తం బాలికలు 939
- బాలురు 1231 మంది



ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

పిడుగురాళ్ల: ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే విద్యార్థుల పరంగా అధిక సంఖ్యలో ఉన్న ప్రభుత్వ బడి పిడుగురాళ్ల పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. ఈ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు ఏకంగా 59 మంది ఉన్నారు. ఈ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మొత్తం విద్యార్థులు 2,170 మంది ఉన్నారు. ఇందులో బాలికలు 939 మంది, బాలురు 1231 మంది ఉన్నారు. 350 మంది విద్యార్థులు పదో తరగతి చదువుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంత ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉన్న పాఠశాల ఉందంటే అది మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాత్రమే. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత అందిస్తుందనడానికి ఈ పాఠశాల నిదర్శనంగా చెప్పవచ్చు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతి పేద విద్యార్థికి నాణ్యమైన విద్యను ఉచితంగా అందించడంతో పాటు కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చి మెరుగైన సౌకర్యాలను కల్పించారు. అంతటితో ఆగకుండా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు తగినట్లుగా ఉపాధ్యాయులను కూడా ఏర్పాటు చేస్తున్నారు. విద్యార్థులకు జగనన్న విద్యా కానుక ద్వారా పుస్తకాలు కూడా ఉచితంగా అందిస్తున్నారు. అందుకే నేడు మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో అలరారుతోంది.

25 తరగతి గదులు, మరో 20 గదులు నిర్మాణంలో..

విద్యార్థుల సామర్థ్యానికి 35 తరగతి గదులు ఉండాల్సిఉంది. ప్రస్తుతం 25 తరగతి గదులు మాత్రమే ఉండటంతో గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో పాఠశాలకు రూ.2.43 కోట్లు నిధులు తెప్పించి అదనంగా మరో 20 తరగతి గదులు నిర్మిస్తున్నారు. అంటే కావాల్సిన 35 గదుల కంటే మరో 10 తరగతి గదులు అదనంగా నిర్మిస్తున్నారు. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు పాఠశాలలో చేరినా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ఈ తరగతి గదులు వచ్చే విద్యా సంవత్సరానికి నిర్మాణం పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు. ఇవీకాక పాఠశాల అభివృద్ధి కోసం నాడు – నేడు కింద మొదటి విడతలో రూ.93 లక్షలతో అభివృద్ధి పనులు నిర్వహించారు. దీంతో ప్రైవేట్ పాఠశాలలకంటే ప్రభుత్వ పాఠశాల్లో మెరుగైన సౌకర్యాలతో పాటు కావాల్సినంత మంది ఉపాధ్యాయులు సమకూరారు. దీంతో విద్యార్థులు ఎక్కువ మంది ఈ పాఠశాలలో చేరుతున్నారు.



పిడుగురాళ్ల పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

క్రమశిక్షణపై ప్రత్యేక శ్రద్ధ..

పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంపొందేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శద్ధ చూపుతున్నారు. పెద్దలను గౌరవిండం వంటివి నేర్పుతున్నారు. విద్యార్థులకు ఇక్కడ ఎన్‌సీసీ శిక్షణ కేంద్రం ఉండటంతో విద్యార్థినీ విద్యార్థులు ఈ హైస్కూల్లో చదువుకునేందుకు మక్కువ చూపుతున్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యను బోధిస్తున్నాం



మా హైస్కూల్లో క్రమశిక్షణతో కూడిన విద్యను విద్యార్థులకు అందిస్తున్నాం. గణితం, ఇంగ్లిష్, సైన్స్ సబ్జెక్టులపై విద్యార్థులకు ప్రతి రోజు ప్రతిభ పరీక్షలు నిర్వహిస్తున్నాం. పదో తరగతి విద్యార్థులకు మొదటి నుంచి స్పెషల్ క్లాసులు నిర్వహిస్తూ ఉత్తమ ఫలితాల కోసం కృషి చేస్తున్నాం.

– లింగాల ధనలక్ష్మి, హైస్కూల్ హెచ్ఎం, పిడుగురాళ్ల

హైస్కూల్లో చదువు బాగుంది



పిడుగురాళ్లలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మా అబ్బాయి షేక్ మహ్మద్ యాసిన్ 10వ తరగతి చదువుతున్నాడు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు విద్యార్థుల ఉన్నతికి బాగా కష్టపడుతున్నారు. నాడు – నేడు పథకంతో పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు ఏర్పడ్డాయి. నాణ్యమైన విద్యను అందిస్తుండటంతో మాకెంతో ఆనందంగా ఉంది.

– షేక్ షరీఫ్, పిడుగురాళ్ల

సీనియర్ ఇంటర్ సైన్స్ ప్రాక్టికల్స్ ప్రారంభం



గుంటూరులోని ఓ కళాశాలలో ఫిజిక్స్ ప్రాక్టికల్స్ చేస్తున్న విద్యార్థులు

గుంటూరుఎడ్యుకేషన్: సీనియర్ ఇంటర్ సైన్స్ కోర్సుల విద్యార్థులకు ఆదివారం ప్రయోగ పరీక్షలు (ప్రాక్టికల్స్) ప్రారంభమయ్యాయి. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని 135 కళాశాలల్లో జరిగిన ప్రాక్టికల్ పరీక్షలకు దరఖాస్తు చేసిన 10,885 మంది విద్యార్థుల్లో 10,666 మంది హాజరయ్యారు. 11 కేంద్రాల్లో ఒకేషనల్ ప్రాక్టికల్స్‌కు దరఖాస్తు చేసిన 958 మంది విద్యార్థుల్లో 874 మంది హాజరయ్యారు. ఇంటర్మీడియెట్ బోర్డు ఆర్జేడీ వీవీ సుబ్బారావు ఒంగోలులోని పలు కళాశాలలను తనిఖీ చేయగా, ఆర్ఐవో జి.సునీత గుంటూరు నగరంలో నాలుగు కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లా పరిశీలకురాలు శేషుకుమారి గుంటూరు, నరసరావుపేటలో పలు కేంద్రాల్లో ప్రాక్టికల్స్ నిర్వహణ తీరును పరిశీలించారు. సైన్స్ ప్రాక్టికల్స్ మొదటి రోజు అధికారులతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, హైపవర్ కమిటీ, డీవీఈవోలు జె.పద్మ, నీలావతి, ఆంజనేయులు కలుపుకుని మొత్తం 60 కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. ప్రాక్టికల్స్ ప్రశాంతంగా ప్రారంభమైనట్లు ఆర్ఐవో సునీత తెలిపారు.

ఫ్యాక్షన్ రాజకీయాలకు చంద్రబాబు కుట్ర

- బ్రహ్మారెడ్డి విమర్శలు అర్థరహితం
- ప్రభుత్వ విప్ పీఆర్కే



మాచర్ల: పల్నాడులో ఫ్యాక్షన్ రాజకీయాలను చంద్రబాబు ప్రోత్సహిస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే) ఆరోపించారు. ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాజకీయాలలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు చేస్తున్న తాను ఇప్పటికీ ప్రజల ఆశీస్సులతో నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచానని గుర్తు చేశారు. తనను విమర్శించే స్థాయి టీడీపీ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డికి లేదని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో తాను ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటున్నట్లు చెప్పారు. ఇప్పటికే రెండు సార్లు నియోజకవర్గంలో పోటీ చేసి ఓడిపోయి గుంటూరులో నివాసముంటూ నాపై విమర్శలు చేయటం హాస్యాస్పదమని పేర్కొన్నారు. ఫ్యాక్షన్ రాజకీయాలలో ఏడు హత్యలు చేయించి, ఆ తరువాత ఇప్పుడు ఫ్యాక్షన్ రాజకీయాలు చేస్తూ వారే వివిధ ప్రాంతాల్లో వారి పార్టీకి చెందిన వాహనాలు దహనం చేసుకొని దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. శవ రాజకీయాలు చేసిన మాజీ సీఎం చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో ఫ్యాక్షన్‌ను ప్రోత్సహించేందుకు బ్రహ్మారెడ్డి వచ్చినట్లు పీఆర్కే ఆరోపించారు. దొంగతనాలు, దోపిడీలు చేసిన వ్యక్తి హత్యకు గురైతే నీ అధిష్టాన నాయకుడు పాడె మోసి ప్రచారం కోసం దిగజారడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడో సారి బ్రహ్మారెడ్డి ఓడిపోవడం ఖాయమని చెప్పారు. అది జరగక్కపోతే నేను రాజకీయాలకు దూరంగా ఉంటానని పీఆర్కే సవాల్ విసిరారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పెదకూరపాడు: ఎస్సీ, ముస్లిం మైనార్టీలకు చెందిన పలువురు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఆనందపేటలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో 25 కుటుంబాలు ఆదివారం రాత్రి చేరాయి. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువ కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కులం, మతం, పార్టీలు చూడకుండా సంక్షేమ పథకాలు అందిస్తుండడంతో ప్రజలు పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి సారథ్యంలో తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధిలో కనీసం పదిశాతమైనా టీడీపీ చేయలేదని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేసి 2024లో మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రి చేయాలని సూచించారు. ఎవరికి ఏ కష్టమొచ్చిన, అవసరమొచ్చిన అండగా ఉంటానని చెప్పారు. వైఎస్సార్ సీపీలో చేరిన వారిలో పగరటి మినాక్షి, షేక్ ముస్తాబీ, బి.షేక్ సైదా, పరగటి ఎస్తేరు,ఉన్నం కిరణ్, కంచర్ల సుశీల, కంచర్ల రాజు, కంచర్ల వంశీ, కంచర్ల ఆజయ్, పరగటి పెద్దబ్బాయి.లక్ష్మీ, మహేష్‌బాబు, లెనిన్‌బాబు, జ్యోతి, హాస్పిటల్ కిరణ్, కాలేబు, తుల శమ్మ, తాళ్ళూరి అశోక్, సంపూర్ణ, స్వాతి, బుజ్జి, బుజ్జి బాబు, చిన్నమ్మాయి, మీరావలి, మహిబా, చిన్నసైదా, అలాభి, శేషయ్య, మహాలక్ష్మి, కుమారి, ఇనుముక్కల గాలిబు, షేక్ చిన్నసైదా, కోలేటి ప్రసాద్, రవి, మౌనిక, బుజ్జి, బంకా బాబు, ముట్లూరి చిన్నమ్మా, బుడ్డాయి, ఏలిజబేత్‌రాణి, చేంబేటి శివకుమారి, బంకా పుష్ప మంజూరు, నేలపాటి ద్రాక్షయని, తాళ్లూరి కోటేశ్వరి పాల్గొన్నారు. ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, ఎస్సీ సెల్ నాయకులు యోహాన్, పార్టీ మండల కన్వీనర్ షేక్ మస్తాన్‌షరీఫ్, భయంకర్ సుభాని, ఎంపీటీసీ కంచర్ల నిర్మల పాల్గొన్నారు.

గ్రామస్థాయి నుంచి వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి

ఎంపీ బీద మస్తాన్‌రావు



అమరేశ్వరాలయంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు తదితరులు

అమరావతి: గ్రామ స్థాయి నుంచే వైఎస్సార్ సీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు సూచించారు. మండల పరిధిలోని ధరిణికోట జేబీ గార్డెన్స్‌లో నియోజకవర్గ స్థాయి ముఖ్యనాయకుల సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అధ్యక్షత వహించారు. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా తెలుగుదేశం పార్టీ నీచ రాజకీయాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకుడు పైలా సోమినాయుడు, ఐదు మండలాల నాయకులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

అమరేశ్వరాలయాన్ని సందర్శించిన ఎంపీ బీద మస్తాన్‌రావు

ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన అమరావతిలో అమరేశ్వరాలయాన్ని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు ఆదివారం సందర్శించారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు స్వాగతం పలికారు. అమరేశ్వర స్వామికి, బాలచాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేష వస్త్రాన్ని, తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం మ్యూజియాన్ని, ధ్యానబుద్ధ ప్రాజెక్టును ఆయన సందర్శించారు.

బుద్ధిస్ట్ సొసైటీ జిల్లా నూతన కార్యవర్గం



నరసరావుపేట ఈస్ట్: బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా పల్నాడు జిల్లా కమిటీ అధ్యక్షుడిగా కొరబండి బాబూరావు, ప్రధాన కార్యదర్శిగా కూచిపూడి చంద్రశేఖర్, కోశాధికారిగా విప్పర్ల చంటిబాబు నియమితులయ్యారు. ప్రకాష్‌నగర్‌లోని ఎన్జీవో హోంలో భారతీయ బౌద్ధ మహాసభ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎలిచర్ల హరిబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉపాధ్యక్షునిగా నల్లపు కోటేశ్వరరావు, గౌరవ సలహాదారునిగా కోండ్రు మోహనరావు, సహాయ కార్యదర్శులుగా గంటెల శివప్రసాదు, పప్పుల త్రికోటేశ్వరరావు, అధికార ప్రతినిధిగా జి.హరిబాబు నియమితులయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.కె.బోధి, సహాయ కార్యదర్శి యంత్రపాటి అశోక్‌కుమార్, గుంటూరు జిల్లా అధ్యక్షుడు జి.మధుబాబు పాల్గొన్నారు.

28న రైల్వే డబ్లింగ్ పనులు పరిశీలనకు అధికారుల రాక



రైల్వే స్టేషనులో యంత్ర పరికరాల ద్వారా డబ్లింగ్ పనులు చేస్తున్న దృశ్యం

శావల్యాపురం: శావల్యాపురం నుంచి మునమాక వరకు రైల్వే డబ్లింగ్ పనులు పరిశీలనకు 28న ఢిల్లీ నుంచి రైల్వే విభాగం భద్రత అధికారి, గుంటూరు డీఆర్‌ఎం రామకృష్ణ రానున్నట్లు శావల్యాపురం రైల్వే స్టేషను సూపరింటెండెంట్ డేవిడ్‌రాజు ఆదివారం తెలిపారు. గుంటూరునుంచి గుంతకల్ రైల్వే లైన్‌లో డబ్లింగ్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే గుంటూరునుంచి సాతులూరు వరకు డబ్లింగ్ పనులు పూర్తి చేశారు. సాతులూరునుంచి మునమాక రైల్వేస్టేషను 15కిలోమీటర్ల వరకు, శావల్యాపురం రైల్వేస్టేషను నుంచి చీకటిఈగలపాలెం వరకు 12 కిలో మీటర్ల డబ్లింగ్ పనులు చేయాల్సి ఉంది. ప్రస్తుతం మునమాక రైల్వే స్టేషను నుంచి శావల్యాపురం రైల్వే స్టేషను వరకు 20 కిలోమీటర్ల వరకు డబ్లింగ్ రైల్వే ట్రాక్ పనులు ఆధునీకీకరణ యంత్ర పరికరాలు సహాయంతో పనులు తుది దశకు చేరాయి. దీంతో అధికారులు పరిశీలించనున్నారు.

సాగర్ నీటిమట్టం 550 అడుగులు

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 550.50 అడుగుల వద్ద ఉంది. ఇది 210.8810 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకి 10,200 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 9,166, ఎస్‌ఎల్‌బీసీకి 2,200, వరద కాలువకు 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం అవుట్‌ఫ్లోగా 21,886 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి వచ్చే నీటి చేరిక పూర్తిగా నిలిచిపోయింది. నీటిమట్టం 823.60 అడుగుల వద్ద ఉంది. ఇది 43.6145 టీఎంసీలకు సమానం.

బ్రాహ్మణ సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్న ప్రభుత్వం

విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



మాట్లాడుతున్న సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

చిలకలూరిపేట: సమాజంలోని వివిధ వర్గాలతో పాటు బ్రాహ్మణ సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు చెప్పారు. ఆదిత్య బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో బ్రాహ్మణ బంధు ఆత్మీయ సమావేశం పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలోని విజ్ఞాన్ విహార్ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన మల్లాది విష్ణు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో బ్రాహ్మణులకు సముచిత కల్పిస్తున్నదని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ ద్వారా కోట్లాది రూపాయాలతో వేద వ్యాస, గాయత్రి, కల్యాణమస్తు, భారతి, గరుడ తదితర పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. అమ్మ ఒడి పథకం ద్వారా ఎందరో బ్రాహ్మణ నిరుపేద తల్లులు తమ పిల్లలకు చదివించగలుగుతున్నారని పేర్కొన్నారు. గతంలో బ్రాహ్మణ సంక్షేమానికి ఇన్ని పథకాలు ఏ ప్రభుత్వం అమలు చేయలేదని తెలిపారు. ఇంత మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ప్రభుత్వానికి బ్రాహ్మణ సమాజం అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, బ్రాహ్మణ సేవా సమితి నాయకులు చల్లా విజయకుమార్, వి శరత్‌కుమార్, ఏకా మారుతీశర్మ, పి చంద్రమౌళి, సీహెచ్ మల్లేశ్వరరావు, ఆర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తైక్వాండో ఉమ్మడి గుంటూరు జిల్లా పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ తదితరులు

రేపల్లె: క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసానికి ఉపయోగపడతాయని మున్సిపల్ చైర్ పర్సన్ కట్టా మంగ పేర్కొన్నారు. న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ సారథ్యంలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో పోటీలు నిర్వహించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల్లో రాణించే వారికి మంచి గుర్తింపుతో పాటు భవిష్యత్ లభిస్తుందని చెప్పారు. డిస్ట్రిక్ట్ తైక్వాండో అసోసియేషన్ సెక్రటరీ కే జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ తైక్వాండో పోటీలను ఉమ్మడి గుంటూరు జిల్లాలోని తైక్వాండో క్రీడాకారులుకు సబ్‌జూనియర్ (అండర్-12), క్యాడెట్ (అండర్-14), జూనియర్, సీనియర్ విభాగాలలో క్రీడాకారులకు పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. పోటీలలో 150 మంది క్రీడాకారులు పాల్గొనారని, వీరిలో ప్రథమ స్థానం పొందిన క్రీడాకారులు మార్చి 10 నుంచి విశాఖపట్నంలోని యలమంచిలిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు పంపటం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విజయసారథి, వార్డెన్ పి.శివశంకర్ ప్రసాద్, సభ్యులు ఎం.శ్రీనివాసరావు, విఠల్‌కుమార్, ఎన్.వీరరాఘవయ్య, సిహెచ్.రంగ, కె.ప్రసాద్‌బాబు, కె.బాబూరావు, కె.వీర్లంకయ్య, కోచ్ దానేశ్వరరావు, పాల్గొన్నారు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య

- వేరే కాపురం పెట్టని కారణంగా అలిగి వెళ్లిన భార్య
- మనస్తాపంతో పురుగు మందు తాగిన భర్త



జాజం సాగర్ మృతదేహం

నరసరావుపేట టౌన్: భార్య కాపురానికి రావటలేదని మనస్తాపంతో భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. కొత్తబావి బజార్‌కు చెందిన జాజం సాగర్(32)కు నాలుగేళ్ల క్రితం తెలంగాణలోని సోంపల్లి గ్రామానికి చెందిన సంధ్యతో వివాహం అయింది. వీరికి రెండేళ్ల పాప ఉంది. వేరే కాపురం పెట్టాలని భార్య, భర్తతో గొడవ పెట్టుకుంది. కుదరక పోవటంతో సంధ్య అలిగి మూడు నెలల క్రితం పుట్టింటికి వెళ్లింది. భర్త అతడి కుటుంబ సభ్యులు వారం రోజుల క్రితం వెళ్లి నచ్చచెప్పేందుకు ప్రయత్నం చేయగా వేరే కాపురం పెడితే తప్ప సంసారం చేసేందుకు రానని చెప్పింది.

ఈ క్రమంలో శనివారం రాత్రి పురుగుల మందు తాగి సాగర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన అతడి తల్లి సైదమ్మ 108కు సమాచారం అందించింది. పరీక్షించిన సిబ్బంది అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న సీఐ అశోక్‌కుమార్ ఆదివారం సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వీధి కుక్కల దాడిలో గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు పరిశీలిస్తున్న వైద్యురాలు

చిలకలూరిపేట: గొర్రెల షెడ్డులోకి వీధి కుక్కలు చొరబడి గొర్రెలపై దాడి చేసి చంపివేసిన ఘటన శనివారం అర్ధరాత్రి మండలంలోని పసుమర్రులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. పసుమర్రుకు చెందిన షేక్ సుభాని గొర్రెలు పెంచుతాడు. అతడికి గ్రామం పొలిమేరలో గొర్రెల షెడ్డు ఉంది. ఈ షెడ్డులోకి శనివారం అర్ధరాత్రి 12 నుంచి ఒంటిగంట సమయంలో వీధి కుక్కలు చొరబడి గొర్రెలపై దాడికి పాల్పడ్డాయి. ఈ దాడిలో 11 గొర్రెలు ఘటన స్థలంలో చనిపోయాయి. మరో ఐదు చిన్న గొర్రెలను కుక్కలు షెడ్డులో నుంచి లాక్కెళ్లాయి. వీటి కోసం గాలించినా జాడ కానరాలేదు. గాయపడిన మరో ఆరు గొర్రెలను పసుమర్రు పశువైద్యశాలకు చెందిన డాక్టర్ పి.దీప్తి బాధితుడి సమాచారం మేరకు రాత్రి సమయంలోనే ఘటనా స్థలానికి వెళ్లి చికిత్స అందించారు.

అనుపు జలాశయంలో మునిగి యువకుడి మృతి



విజయపురిసౌత్: అనుపు కృష్ణా జలాశయంలో మునిగి యువకుడి మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. తెలంగాణలోని నల్గొండ జిల్లా, మర్రిగూడ మండలం, దామనవారి భీమనపల్లి గ్రామానికి చెందిన ఇటుకలపాటి ప్రకాష్(32), బంధువులు ఇద్దరితో కలసి విజయపురిసౌత్‌లోని సాగర్‌మాత దేవాలయానికి వచ్చాడు. దర్శనం అనంతరం పర్యాటక ప్రాంతమైన అనుపునకు వెళ్లారు. అక్కడి కృష్ణా జలాశయంలో ముగ్గురు స్నానానికి దిగారు. ప్రమాదవశాత్తూ ప్రకాష్ కాలు జారి జలాశయంలో మునిగి మృతి చెందాడు. ప్రకాష్ బంధువులు ఫిర్యాదు మేరకు విజయపురిసౌత్ ఎస్‌ఐ పి.అనిల్‌కుమార్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైస్ మిల్లులో కార్మికుడి మృతి

దుర్గి: మండల పరిధిలోని ఓబులేశునిపల్లె పరిధిలోని పల్నాడు బాయిల్డ్ రైస్ మిల్లులో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకున్న ప్రమాదంలో కార్మికుడు మృతి చెందాడు. వివరాలు.. బిహార్ రాష్ట్రానికి చెందిన రిషికపూర్ పాశ్వాన్ (22) స్థానిక రైస్ మిల్లులో గత కొంతకాలంగా కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మిల్లులో సాంకేతిక లోపం రావడంతో వడ్లు వస్తున్న క్రమాన్ని పరిశీలిస్తుండగా మరో కార్మికుడు స్విచ్ ఆన్ చేయగా వడ్లు పూర్తిగా అతడిపై పడి ఊపిరి ఆడక చనిపోయాడు. యాజమాన్యం నిర్లక్ష్యం మూలంగానే కార్మికుడు మృతి చెందినట్లు తోటి కార్మికులు ఆరోపిస్తున్నారు. మృతుడి కుటుంబానికి యాజమాన్యం ఆదుకోవాలని కోరుతున్నారు.

తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల కమిటీ సభ్యురాలిగా పద్మజ

పాత గుంటూరు: ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల కమిటీ కార్యనిర్వాహక సభ్యురాలిగా తెనాలికి చెందిన శ్రీశ్రీ కళావేదిక గుంటూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు పోలిశెట్టి పద్మజ రామకృష్ణ నియమితులయ్యారు. శ్రీశ్రీ కళావేదిక, ఇంద్రాణి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో ఏప్రిల్ 9, 10 తేదీల్లో తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో 'తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలు' నిర్వహిస్తున్నారు. వివరాలకు 8247519925ను సంప్రదించాలని ఆమె కోరారు.